

విద్యుదాఘాతంతో కల్లుగీత కార్మికుడు మృతి

ప్రజాశక్తి - ఆచంట

పశువులకు పచ్చగడ్డి కోసేందుకు వెళ్లిన కల్లుగీత కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన ఆదివారం మధ్యాహ్నం మండలంలోని వల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది. ఆచంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నరసింహమూర్తి ఆదివారం మధ్యాహ్నం వల్లూరు శివారు రొయ్యల చెరువుల దగ్గరకు తన పశువులకు పచ్చగడ్డి కోసేందుకు వెళ్లాడు. కొడవలితో పచ్చగడ్డి కోస్తుండగా విద్యుత్ వైర్‌ను కోసేశాడు. దీంతో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయి నరసింహమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ బిఎస్‌డిఆర్.ప్రసాద్ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాలకొల్లు ప్రభుత్వాస్పత్రికి తరలించారు

'రక్త' బంధువులు..!

రక్తదానంపై రెండు జిల్లాల్లో పెరుగుతున్న అవగాహన
పెద్దఎత్తున ముందుకు వస్తున్న యువత
జిల్లాలో ఏడాదికి పదివేల యూనిట్ల రక్తం అవసరం
తలసేమియా, రక్తహీనత రోగులకు నెలకు రెండుసార్లు రక్తం ఎక్కించాల్సిందే
ప్రసవాలు, ఆపరేషన్ల సమయంలో ఆదుకుంటున్న దాతలు
నెగిటివ్ బ్లడ్ గ్రూపుల రక్తనిల్వలో కొంత ఇబ్బంది



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో గైనిక్ సమస్యతో ఆపరేషన్ చేయించుకునేందుకు లింగపాలెం మండలానికి చెందిన వెంకటలక్ష్మి చేరింది. ఆపరేషన్ చేసేందుకు బ్లడ్ అవసరమని డాక్టర్లు తెలిపారు. ఆమెది 'ఎ' నెగిటివ్ బ్లడ్. బ్లడ్‌బ్యాంకుల్లో ఆ గ్రూప్ రక్తం నిల్వలు లేకపోవడంతో ఏం చేయాలో అర్థంకాలేదు. వెంటనే తెలిసినవారికి చెప్పడంతో సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. ఆ పోస్టు చూసి ఏలూరుకు చెందిన యువకుడు ఫోన్ చేసి వెంటనే రక్తదానం చేసి వెళ్లడంతో వెంకటలక్ష్మికి సకాలంలో డాక్టర్లు ఆపరేషన్ చేయగలిగారు.'

'కామవరపుకోట మండలానికి చెందిన ఓ యువతి గుండె ఆపరేషన్ చేయించుకునేందుకు ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేరింది. 'ఒ' పాజిటివ్ బ్లడ్ అత్యవసరమని డాక్టర్లు చెప్పారు. విషయం తెలుసుకుని ఆ గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వచ్చి రక్త దానం చేశారు. దీంతో ఆపరేషన్ జరిగి ఆ యువతి ప్రాణాపాయం నుంచి బయటపడింది.'

ప్రాణప్రాయ స్థితిలో ఉన్నవారికి రక్తం ఇస్తున్న ఎంతోమంది దాతలు ఆయా కుటుంబాలకు రక్తబంధువులుగా మారి మరిచిపోలేని గుర్తులను మిగులుస్తున్నారు. రక్తందానంపై పెరుగుతున్న అవగాహన ఎంతోమంది ప్రాణాలను నిలబెడుతోంది. ఒకప్పుడు రక్తదానం చేసేందుకు భయపడేవారు. దీంతో సకాలంలో రక్తం అందక ఎంతోమంది ప్రాణాలు కోల్పోయిన పరిస్థితి సైతం ఉండేది. నేడు అలాంటి పరిస్థితి నుంచి బయటపడుతున్నట్లు బ్లడ్‌బ్లాంకుల్లోని రక్త నిల్వలతోపాటు, సోషల్‌మీడియాలో పోస్టులకు స్పందించి వచ్చి రక్తదానం చేస్తున్న ఉదంతాలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 15 వరకూ బ్లడ్‌బ్యాంకులున్నాయి. ఏలూరులో రెడ్‌క్రాస్, ప్రభుత్వాసుపత్రిలో బ్లడ్‌బ్యాంకు రోగులకు రక్తం సరఫరా చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. అదేవిధంగా తణుకు, భీమవరం, జంగారెడ్డిగూడెం వంటి ప్రాంతాల్లోనూ బ్లడ్ బ్యాంకులు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి. ప్రతీరోజు ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రుల్లో ప్రసవాలు, సర్జరీలు, రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన రోగులకు రక్తం అత్యవసరం అవుతోంది. నెలకు కనీసంగా 800 నుంచి వెయ్యి యూనిట్ల వరకూ రక్తం రోగులకు అవసరం పడుతున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 175 మంది తలసేమియా, వందమందికిపైగా చికెన్‌సెల్ రోగులున్నారు. వీరికి నెలకు రెండుసార్లు రక్తం ఎక్కించాల్సి ఉంటుంది. కొంతమందికి నెలకు మూడుసార్లు సైతం రక్తం ఎక్కించాలి. గతంలో ఇలాంటి రోగులకు రక్తం ఎక్కించాలంటే కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. వేలకువేలు పోసి రక్తం కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు పడేవారు. కొన్నిసార్లు కొనుగోలు చేసేందుకు సైతం రక్తం దొరికన పరిస్థితి ఉండేది. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదనే చెప్పాలి. రెడ్‌క్రాస్, ప్రభుత్వ బ్లడ్‌బ్యాంకుల్లో తలసేమీయా, చికెన్‌సెల్ రోగులకు ఇబ్బంది లేకుండా రక్తం అందిస్తున్నారు. జిల్లాలో అవసరానికి సరిపడు రక్త నిల్వలుంటున్నాయి. గతంలో ఈపరిస్థితి ఉండేదికాదు. రక్తదానం చేసేందుకు ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి లేకపోవడంతో రక్తం కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉండేది. బ్లడ్‌బ్యాంకు నిర్వాహకులు డిగ్రీ, ఇంజినీరింగ్ కాలేజీల్లో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరాల్లో యువత పెద్దఎత్తున ముందుకు వచ్చి రక్తం దానం చేస్తున్నారు. ఇదివరకూ యువకులు మాత్రమే రక్తదానం చేసేవారు. ఇప్పుడు కాలేజీల్లో చదువుతున్న యువతులు సైతం రక్తం ఇచ్చేందుకు ముందుకు వస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. రక్తదానం చేసేవారిలో 15 నుంచి 20శాతం మంది అమ్మాయిలు ఉండటం విశేషం.

కార్యక్రమాల్లో రక్తదాన శిబిరాలు

గతంలో సినిమా హీరోలు, నాయకుల పుట్టిన రోజులు జరిగినప్పుడు కటౌట్‌లు వంటివి కట్టి అభిమానులు సంబరాలు చేసుకునేవారు. కానీ పరిస్థితిలో మార్పు వచ్చింది. సినిమాహీరోల ఫ్యాన్స్ తమ హీరోల పుట్టినరోజులకు రక్తదానాలు చేస్తున్నారు. నాయకులకు సంబంధించిన కార్యక్రమాల్లోనూ కార్యకర్తలు ఇదే ఒరవడిని కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో యువజన సంఘాలు సైతం రక్తదానం చేసేందుకు ముందుకు వస్తున్నాయి. పోలీసు అమరవీరుల దినోత్సవం వంటి కార్యక్రమాల సమయంలో పోలీసులు పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఏడాదికి జిల్లాలో పదివేల యూనిట్ల వరకూ రక్తం దాతలనుంచి వస్తోంది. 350 ఎంఎల్ రక్తం ఉన్న ప్యాకెట్‌ను ఒక్క యూనిట్‌గా పరిగణిస్తారు. 18 ఏళ్ల నిండి, 45 కిలోల బరువు పైన ఉన్నవారు మూడునెలలకు ఒకసారి ఏడాదికి నాలుగుసార్లు రక్తం ఇవ్వొచ్చు. రక్తం తీయడం, ఎక్కించడం వచ్చిన వారికి మాత్రమే బ్లడ్‌బ్యాంకు నిర్వహణ లైసెన్సులు ఇస్తారు. రక్త సేకరణ సమయంలో ఐదు రకాలైన ఎయిడ్స్, మలేరియి వంటి పరీక్షలు నిర్వహించి మంచి రక్తాన్ని మాత్రమే సేకరించి రోగులకు అందిస్తారు. బ్లడ్‌బ్యాంకుల్లో ప్రస్తుతానికి సరిపడు నిల్వలు ఉంటున్నప్పటికీ నెగిటివ్ గ్రూప్‌కు సంబంధించిన రక్తం విషయంలో మాత్రం తీవ్ర ఇబ్బంది ఉంటుంది. రక్తదానంపై మరింత అవగాహన పెరిగితే ఈ సమస్యను కూడా అధిగమించొచ్చనని అధికారులు చెబుతున్నారు. రక్తదానంపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాల్సి ఉంది.

యువతరం జీవితాలతో..

ట్వంటీ-20..!

బెట్టింగులతో చెలరేగిపోతున్న యువత
దృష్టిసారించని పోలీసు యంత్రాంగం
లాడ్జిల్లోనే బుకీల మకాం..!
ఉమ్మడి జిల్లాలో ఇదీ పరిస్థితి



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ట్వంటీ-20.. ఈ పదం వింటేనే చాలు యువతరం ఊగిపోతుంది.. మ్యాచ్ ఆరంభానికి ముందే టీవీలకు అతుక్కుపోతుంది.. ఈ ఆట కోసం నెలల తరబడి వేచి చూస్తుంది.. అదే బెట్టింగురాయుళ్లకు కలిసొచ్చింది. యువతలోని అత్యుతతను సొమ్ము చేసుకుంటుంది. ఏ జట్టు గెలుస్తోంది? ఏ జట్టు ఎన్ని పరుగులు చేస్తోంది? వంటి పదాలతో పందేలు కాస్తుంది. చివరకూ యువతను జూదం అనేమత్తులో దించుతోంది.

అస్ట్రేలియా వేదికగా కొద్దిరోజులుగా జరుగుతున్న టీ-ట్వంటీ వరల్డ్ కప్ పోటీల్లో బుకీలు బరితెగించి మరీ పందేలకు దిగుతున్నారు. పట్టణాలు, పల్లెలు తేడా లేకుండా యువతను ఈ రొంపిలోకి దించి సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే మ్యాచ్‌లు ఆరంభమై దాదాపుగా లీగ్ దశ కూడా పూర్తికావొస్తోంది. దీంతో ఇప్పటి వరకూ నిర్వహించిన పందేలను రెట్టింపు చేయాలని బుకీలు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఏలూరు, భీమవరం, తాడేపల్లిగూడెం, తణుకు, నరసాపురం వంటి ప్రాంతాలతో పాటుగా కొత్తగా ఏలూరు జిల్లాలో కలిసిన నూజివీడు వంటి ప్రాంతాల్లోనూ పంటర్లు (ప్రధాన బుకీల వద్ద సబ్ బుకీలు) తిష్టవేశారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న లాడ్జీలతో పాటుగా శివారునున్న ప్రాంతాల్లో ఇళ్లను అద్దెకు తీసుకుని వాటి కేంద్రంగా పందేలను నిర్వహిస్తున్నారు. ప్రధాన బుకీలు మాత్రం విశాఖపట్నం, విజయవాడ, హైదరాబాద్, చెన్నై వంటి ప్రాంతాల నుంచి వీరికి బంతి బంతికీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకున్న వైర్‌లెస్ రేడియోల ద్వారా రేట్ల వివరాలను వెల్లడిస్తున్నారు. బంతిబంతికీ రేటు మారుతుండే విధానం కాబట్టి వీరు కూడా ఎప్పటికప్పుడు పందెంరాయుళ్లకు అప్‌డేట్‌ను ఇస్తున్నారు.

ప్రత్యేక యాప్‌ల ద్వారా పందేలు..!

బుకీలు ఈ పందేల కోసం బుకీలు ప్రత్యేకంగా యాప్‌ను రూపొందించారు. ఆ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు (బంతి బంతికీ) రేటును తెలియపరుస్తున్నారు. కొంతకాలం క్రితం వరకూ వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా ఈ విధంగా నడిపేవారు. ఆ తర్వాత టెలిగ్రాంను కూడా వినియోగించారు. అయితే వీటిద్వారా అయితే పోలీసులు కనిపెడుతున్నారనే ఉద్దేశంతో బుకీలు కూడా కొత్త పంథాను ఎంచుకున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ద్వారానే పందేలను నిర్వహిస్తున్నట్లు సమాచారం.

ఎందుకంత ఉదాసీనత..?

బుకీల, పంటర్ల వివరాలు దాదాపుగా పోలీసులకు తెలిసినప్పటికీ వారిపై ప్రత్యేకంగా నిఘాను పెట్టడంలో పోలీసు వ్యవస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందనే వాదన లేకపోలేదు. గతంలో పట్టుబడిన వారి కదలికలపై పోలీసులు నిఘా ఉంచితే కచ్చితంగా మంచి ఫలితాలు వస్తాయని పలువురు చెబుతున్నారు. అయితే కొందరు పోలీసులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం, మరికొందరు పనిఒత్తిడికి గురై పట్టించుకోకపోవడం వల్లే నిఘా పెట్టడం లేదనేది తెలుస్తోంది. వీరితో పాటుగా మరికొందరు బుకీలకు సహకరిస్తూ ముడుపులు తీసుకుంటున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ట్వంటీ -20 వరల్డ్ కప్ మ్యాచ్‌లు ఆరంభమవుతున్నాయంటే చాలు బుకీలు చాలాకాలం నుంచి దానికోసమే ఎదురుచూస్తూ ఉంటారు. అయినా పోలీసులు ఇప్పటివరకూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో బుకీలను అరెస్టు చేసిన దాఖలాలు పెద్దగా లేకపోవడం పోలీసుల వైఫల్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఇప్పటికైనా పోలీసులు వారి కదలికలపై నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. కార్తీక మాసం రెండో ఆదివారం కావడంతో పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు అధిక సంఖ్యలో ప్రత్యేక ద్విచక్ర వాహనాల్లో బీచ్‌కు తరలివచ్చారు. పలువురు సముద్ర కెరటాల్లో స్నానాలు చేశారు. చిన్నారులు ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఇసుక తిన్నెలపై ఆటలాడుకున్నారు. ఒడ్డున ఉన్న దేవాలయాలను దర్శించుకుని సరివే, కొబ్బరి తోటల్లో సహపంక్తి భోజనాలు చేసి సేదతీరారు. బీచ్‌లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డిఎస్‌పి వీరాంజనేయరెడ్డి పర్యవేక్షణలో సిఐ వాడపల్లి సురేష్ బాబు ఆధ్వర్యంలో ఎస్ఐలు ఎం.వీరబాబు, ఎస్.ప్రియకుమార్, బాదం శ్రీను, చంద్రశేఖర్ వంద మంది పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. రెవెన్యూ, పంచాయతీ, ఆరోగ్య శాఖ, మత్స్యశాఖ తదితర శాఖల సిబ్బంది బీచ్ వద్ద విధులు నిర్వహించారు.



సముద్ర కెరటాల్లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

ఎంఎల్ఎ మంతెన రామరాజు

ప్రజాశక్తి - కాళ్ల

ఆక్వా రంగంలో రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని ఎంఎల్ఎ మంతెన రామరాజు తెలిపారు. పెదఅమిరంలో రాధాకృష్ణ కన్వెన్షన్ హాల్లో మూడు రోజుల పాటు నిర్వహించే ఎక్స్‌పో ఇండియా ఎగ్జిబిషన్ ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మంతెన రామరాజు మాట్లాడుతూ పెట్టుబడి వ్యయాన్ని తగ్గించి, దిగుబడి పెంచేందుకు ఇలాంటి సదస్సులు, ఎగ్జిబిషన్లు ఎంతో ఉపయో గపడతాయన్నారు. ఆక్వా రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక మార్పులు తెలుసుకోవడానికి ఆక్వా ఎక్స్‌పో ఇండియా సదస్సులు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆక్వా ఎక్స్ ఇండియా హైదరాబాద్ సిఇఒ వేణు దంతలూరి, ఆక్వా ఎక్స్‌పోలో వివిధ స్టాల్స్ ఏర్పాటు చేసిన వివిధ సంస్థల యజమానులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.



పెదఅమిరంలో ఆక్వాఎక్స్‌పో ఇండియా ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఎల్ఎ మంతెన రామరాజు

ఎస్ఎఫ్ఐ పట్టణ కమిటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.జాన్, ఎ.మురళీ కృష్ణ

ప్రజాశక్తి - నరసాపురం

ఇంటర్న్ షిప్ చేసే విద్యార్థులకు స్టైఫండ్ ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు డిమాండ్ చేశారు. ఆదివారం ఉదయం స్థానిక మీరా గ్రంథాలయంలో జిల్లా కమిటీ సభ్యుడు పవన్ కళ్యాణ్ అధ్యక్షతన నరసాపురం కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షులు పి.వాసు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ప్రవేశపెట్టింది. ఇంటర్న్ షిప్‌లో విద్యార్థి చదువు, ప్రతిభకు తగ్గట్టు ఏ రంగంలో ఇంటర్న్‌షిప్ చేయాలనేది విద్యార్థి నిర్ణయించుకోవాలని కానీ ఈ విధానం దానికి పూర్తి విరుద్ధంగా ఉందని తెలిపారు. ప్రభుత్వం ముందు అన్ని సదుపాయాలు కల్పించిన తర్వాత ఇంటర్న్‌షిప్‌ను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఇంటర్న్ షిప్ చేసే విద్యార్థులకు స్టైఫండ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులుగా ఎండి.జాన్, ఎ.మురళీకృష్ణ, ఉపాధ్యక్షులు ఐ.పవన్‌కళ్యాణ్, ఆర్.రాణి, సహాయ కార్యదర్శులుగా ఎం.సాయికృష్ణ, ఫణీంద్ర, మనస్విని కమిటీ సభ్యులుగా శైలజ, యువ కిరణ్, మనోజ్, ఆదిత్య, సుధీర్, ఉమేష్, సాగర్, గణపతి, మురళీకృష్ణ, కళ్యాణ్ బాబు, అభినవ్, సూర్య, నిధి ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు ఎం.జాన్, ఎ.మురళీకృష్ణ మాట్లాడుతూ హాస్టల్ మెస్ ఛార్జీలు పెంచాలన్నారు. హాస్టల్ సమస్యలపై రేపటి నుంచి సర్వే నిర్వహించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎండి.జాన్



ఎ.మురళీకృష్ణ

పకడ్బందీగా ఇ-క్రాప్ నమోదు

ఈ నెల 9న జాబితా వెల్లడి
97.4 శాతం ఇకెవైసి నమోదు
4 లక్షల 92 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తే లక్ష్యం
వ్యవసాయశాఖ జెడి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

గతంలో చేపట్టిన ఇ-క్రాప్ నమోదులో తప్పులు దొర్లాయి. అయితే ప్రస్తుత ఇ-క్రాప్ నమోదు పటిష్టవంతంగా నూటికి నూరు శాతం పూర్తి చేశామని, ఈ నెల తొమ్మిదో తేదీన ఇ-క్రాప్ పూర్తిస్థాయి జాబితాను వెల్లడించనున్నామని జిల్లా వ్యవసాయశాఖ జెడి వెంకటేశ్వరరావు తెలిపారు. 97.4 శాతం ఇకెవైసి నమోదు పూర్తిచేశామని, ఈ సార్వాలో నాలుగు లక్షల 92 వేలు మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా తీసుకున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకూ జరిగిన ఇ-క్రాప్, ఇకెవైసి నమోదు, ధాన్యం ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు తదితర అంశాలపై ప్రజాశక్తి నిర్వహించిన ముఖాముఖిలో ఆయన మాట్లాడారు.



ప్రశ్న : ఇ-క్రాప్ నమోదులో గతంలో అనేక ఆరోపణలు వినిపించాయి. ప్రస్తుతం ఈ నమోదు ఏ విధంగా జరిగింది?

ఇ-క్రాప్ నమోదులో కొన్ని అవకతవకలు జరగడం వాస్తవం. గతంలో పెద్ద ఎత్తున ఆరోపణలొచ్చాయి. అయితే ఈసారి ఇ-క్రాప్ నమోదు అత్యంత పటిష్టంగా చేపట్టాము. నూటికి నూరు శాతం నమోదు పూర్తిచేశాం. జిల్లా కలెక్టర్ నుంచి కిందిస్థాయి అధికారుల వరకూ క్షుణ్నంగా పరిశీలించాము. ఎలాంటి అవకతవకలకూ తావులేకుండా ఇ-క్రాప్ నమోదు చేశాం.

ప్రశ్న : ఇ-క్రాప్ నమోదులో అవకతవకలకు పాల్పడిన వారిపై ఏమైనా చర్యలు తీసుకున్నారా?

అవకతవకలకు పాల్పడిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నాము. ఇలా చేయడం ద్వారా మిగిలిన వారిలో ఒక భయం అనేది ఏర్పడుతుంది. మళ్లీ అలాంటి తప్పులు జరిగేందుకు ఆస్కారం లేకుండా ఇ-క్రాప్ నమోదులో ఒకటికి పదిసార్లు పరిశీలించి పటిష్టమైన చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న : ఇ-క్రాప్ నమోదులో తప్పులు సరిదిద్దేందుకు ఏమైనా చర్యలు చేపట్టారా?



జిల్లావ్యాప్తంగా అన్ని సచివాలయాల్లో గ్రామసభలు నిర్వహించాము. గత మూడు రోజుల నుంచి ఈ ప్రక్రియ కొనసాగుతుంది. వరి పంటలు వేరేపంటగా నమోదైనా, వేరే పంటలను చెరువులుగా నమోదైన ఇలాంటివి సరిచేసుకునేందుకు గ్రామసభలు నిర్వహించాము. ఇవిపూర్తయిన తర్వాత ఈ నెల తొమ్మిదో తేదీన ఇ-క్రాప్‌కు సంబంధించి పూర్తిస్థాయి జాబితా వెలువరించడం జరుగుతుంది.

ప్రశ్న : ఇకెవైసి నమోదు ఎంతమేర జరిగింది.

జిల్లావ్యాప్తంగా ఇప్పటి వరకు 97.46 శాతం ఇకెవైసి నమోదు పూర్తయింది. ఈ ప్రక్రియ శరవేగంగా జరుగుతోంది. మరికొన్ని రోజుల్లో దీన్ని కూడా నూటికి నూరు శాతం నమోదు చేస్తాము.

ప్రశ్న :ఈ ఏడాది సార్వా పంటలో ఎంతమేర ధాన్యాన్ని ఉత్పత్తి చేసేందుకు లక్ష్యంగా తీసుకున్నారు.

జిల్లావ్యాప్తంగా ఈ ఏడాది రెండు లక్షల 19 వేల ఎకరాల్లో సార్వా సాగు రైతులు చేపట్టారు. దిగుబడి ఆశాజనకంగానే ఉంది. జిల్లావ్యాప్తంగా నాలుగు లక్షల 92 వేల మెట్రిక్ టన్నుల ధ్యాన్యాన్ని ఉత్పత్తి చేసే విధంగా లక్ష్యం నిర్ణయించుకున్నాం. తీసుకున్న లక్ష్యానికి అనుగుణంగా ముందుకు సాగడం జరుగుతుంది.

ప్రశ్న : ధాన్యం కొనుగోలు ప్రారంభించారా.

ధాన్యం కొనుగోలుకు అన్నివిధాలా చర్యలు తీసుకున్నాము. జిల్లావ్యాప్తంగా 389 రైతు భరోసా కేంద్రాలున్నాయి. వీటిలో 286 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధం చేశాము. రెండు వారాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానుంది.

ప్రశ్న : ఎంత మేర ధాన్యం కొనుగోలు లక్ష్యంగా ఎంచుకున్నారు.

జిల్లావ్యాప్తంగా నాలుగు లక్షల 92 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేసే విధంగా లక్ష్యాన్ని తీసుకోవడం జరిగింది. దీనిలో సుమారు 80 శాతం ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ఇప్పటికే చర్యలు చేపట్టాం.కొన్ని ప్రాంతాల్లో ముందు వెనుక సాగు రైతులు చేపట్టడం ద్వారా మాసూళ్ల ప్రక్రియ ఆలస్యమైంది.తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో ఈ ప్రక్రియ ప్రారంభమైంది. మిగిలిన చోట్ల మసూళ్లకు ఇంకా సమయం పట్టే అవకాశముంది.రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

ధాన్యం సేకరణలో నూతన విధానం నష్టదాయకం

జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

ధాన్యం సేకరణ కేంద్రాలకు రూపొందించిన నూతన విధానం వల్ల సొసైటీలు నష్టాల్లోకి వెళ్తాయని జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశం తెలిపింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ కార్యవర్గ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి జిల్లా యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.బాబూరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు పివి సత్యనారాయణ రాజు హాజరయ్యారు. గౌరవాధ్యక్షులుగా సిఐటియు నాయకులు కె.రాజా రామ్మోహన్ రాయ్ విచ్చేశారు. యూనియన్ కన్వీనర్ పీవీ నరసింహరాజు పాల్గొన్నారు ఈ సందర్భంగా గౌరవాధ్యక్షులు అయ్యగారు మాట్లాడుతూ సహకార సంఘాల ఆధ్వర్యంలో నడుస్తున్న ధాన్యం సేకరణ కేంద్రాలకు రూపొందించిన నూతన విధానం వల్ల సహకార సంఘాలు నష్టాల్లోకి వెళ్తాయన్నారు. కొత్త నిబంధనల వల్ల కార్యదర్శికి పూర్తి బాధ్యత ఇవ్వడంతో ఏదైనా పొరపాటు జరిగితే పోలీసులు కేసులు బనాయిస్తారని కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారన్నారు. సంఘాలకు సంబంధంలేని వ్యక్తులతో ధాన్యం సేకరణ జరిగే ప్రక్రియ సంఘాలకు చేటు చేకూరుస్తుందని ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఇటీవల సహకార సంఘాల ఆర్థిక పరిస్థితిని గమనించకుండా వాటి చెల్లింపు సామర్థ్యాన్ని కూడా పరిశీలించకుండా వారి వ్యాపారానికి మించి కోట్ల రూపాయలతో నిర్మించడం తగదన్నారు. అలాగే నిర్మించిన గోదాములు 30 సంవత్సరాల్లో 30 వాయిదాల్లో బాకీ తీర్చాలి, తరువాత గోదామును ప్రభుత్వానికి అప్పగించాలి, ఈ గోదాములపై సహకార సంఘాలకు ఏ విధమైన హక్కులుండవు ఇది కేవలం సహకార సంఘాలను నష్టాల్లోకి నెట్టి వేయడం తప్ప మరొకటి కాదని ఆందోళన చెందారు. రాష్ట్ర యూనియన్ అధ్యక్షులు పివి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ 13 జిల్లాల్లోని సహకార సంఘాల ఉద్యోగుల సంక్షేమం కోరి మన యూనియన్ పనిచేస్తుందన్నారు. ఈ యూనియన్ ద్వారా మాత్రమే ఉద్యోగులకు పూర్తిస్థాయి న్యాయం చేకూర్చగలమన్నారు. జిల్లా యూనియన్ అధ్యక్షులు కె.బాబూరావు మాట్లాడుతూ నేడు జరిగిన కార్యవర్గ సమావేశంలో సంఘాలు ఎదుర్కొంటున్న సమస్యలపై జిల్లా కలెక్టర్, జిల్లా సహకార అధికారికి, జిల్లా సివిల్ సప్లై అధికారికి వినతి పత్రాలు ఇవ్వడానికి నిర్ణయించిందని తెలిపారు. యూనియన్ కన్వీనర్ పివి నరసింహరాజు మాట్లాడుతూ ఈనెల 26వ తేదీన తాడేపల్లిగూడెంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ మహాసభ జరుగుతుందని, జిల్లాలోని 257 సహకార సంఘాల ఉద్యోగులు పాల్గొంటారని కార్యవర్గం నిర్ణయించిందని తెలిపారు. ఈ సమావేశంలో డి.సత్యనారాయణ కృష్ణశాస్త్రి, దొమ్మేరు ప్రసాద్, బొర్రా రామచంద్రరావు, రేలంగి శ్రీనివాసరావు, భీమేశ్వరరావు, సీతారామరాజు, మల్లికార్జునరావు, ఐవి కృష్ణంరాజు, సిహెచ్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ప్రజాశక్తి - ఇరగవరం

ప్రభుత్వం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ డిమాండ్ చేశారు. ఆదివారం ఇరగవరంలో స్థానిక తూర్పు కాపుల రామాలయం వద్ద ఎన్.సత్యవతి అధ్యక్షతన సిఐటియు మండల కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ కార్మికులు సాధించుకున్న 44 చట్టాలను మోడీ ప్రభుత్వానికి అనుకూలంగా మారినా, వైసిపి, టిడిపి కలిపి 4 లేబర్ కోడ్స్‌గా పార్లమెంట్‌లో మార్చారని విమర్శించారు. స్కీమ్ వర్కర్స్‌కు పెరుగుతున్న ధరలకనుగుణంగా వేతనాలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని అన్నారు. స్కీమ్ వర్కర్స్‌కు ఆదాయంతో నిమిత్తం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. స్కీమ్ వర్కర్స్ తెలంగాణ కంటే రూ.వెయ్యి ఎక్కువ ఇస్తానన్న వైసిపి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. ఈ నెల 16, 17 తేదీల్లో పాలకొల్లులో జిల్లా మహాసభలు జరగనున్నాయని తెలిపారు. ఈ మహా సభల్లో కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు పోరాట కార్యాచరణ చేపడతామన్నారు. అనంతరం నూతన కమిటీ ఏర్పాటు చేశారు. అధ్యక్ష కార్యదర్శులుగా శ్యామల, దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షులుగా ఎం.విజయకుమారి, ఎన్.సత్యవతి, ఎ.బ్రహ్మాజీ, సహాయ కార్యదర్శులుగా పాలా ఉమామహేశ్వరి, బి.అప్పారావు, పి.గోవర్ధన్, మరో 6 గురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో విజయకుమారి, రూబీన్స్, గోవిందరాజు, గోవర్ధన్, అప్పారావు, నీలావు ఆంజనేయులు, మునయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

వైసిపి రైతు పక్షపాతి : మంత్రి కొట్టు

చినతాడేపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్రంలో మొదట మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో ఆదివారం ప్రారంభించినట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. ఆదివారం చినతాడేపల్లిలో రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైసిపి రైతు పక్షపాతి ప్రభుత్వమన్నారు. దళారులు, మిల్లర్ల మోసాలకు రైతులు గురికాకుండా ఆర్‌బికె వ్యవస్థను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతులు మద్దతు ధరకు అమ్ముకోలేదన్నారు. సాధారణ రకం క్వింటాకు రూ.1530, ఎ గ్రేడ్ రకం క్వింటాకు రూ.1545 చొప్పున కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. రైతుల మేలు కోసం ఏర్పాటు చేసిన ఆర్‌బికె వ్యవస్థ గురించి కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. జెసి జెవి మురళి మాట్లాడుతూ జిల్లాలో నూరుశాతం ఈ క్రాప్, ఇకెవైసి పూర్తి చేయడం జరిగిందన్నారు. రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యానికి 21 రోజుల్లో డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకున్నామని జెసి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ దాసి రాజు, డిఎం సివిల్ సప్లై టి.శివప్రసాద్, డిఎస్ఓ ఎన్.సరోజ, డిసిఒ రవికుమార్, డిపిఒ ఎం.నాగరాణి పాల్గొన్నారు.



బాధితులకు సాయం అందజేస్తున్న జెడ్‌పి ఛైర్మన్

బాధితులకు జెడ్‌పి ఛైర్మన్ సాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని బ్రాడీపేటకు చెందిన మల్లిడి సూరమ్మ, వికలాంగుడు షేక్ సెంటు మదీన్ ఆదివారం జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్‌ను కలిసి తమ పరిస్థితిని వివరించారు. వారిద్దరికీ తక్షణ సాయంగా ఒక్కొక్కరికీ 25 కేజీల బియ్యం, రూ.2 వేలు ఆర్థిక సాయం అందజేశారు. దీనిపై వీల్ ఛైర్ ఏర్పాటు చేస్తానని జెడ్‌పి ఛైర్మన్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు దత్తాత్రేయ వర్మ, మైబెల్‌రాజు, కొరాడ శ్రీనివాస్, గాడి వెంకన్న, అడబాల వెంకటరమణ పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కొత్త కాయలతిప్ప సమీపంలోని పైప్‌లైన్‌కు అధికారులు మరమ్మతులు చేయించారు. ఈ పైప్‌లైన్ మరమ్మతులకు గురై శుద్ధ జలాలు వృథాగా ఉప్పుటేరులోకి పోతున్నాయి. దీనిపై ఇటీవల ప్రజాశక్తిలో తాగునీరు కలుషితం.. ప్రజలకు అనారోగ్యం అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి గ్రామీణ నీటి సరఫరా విభాగం ఎఇ మోహనరావు స్పందించి మరమ్మతులు చేశారు. శుద్ధి జలాలు కలుషితాన్ని అరికట్టారు.



ఎంఎల్‌ఎ మంతెన రామరాజును సత్కరిస్తున్న ఛైర్మన్ కృష్ణంరాజు

వైభవంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్లకూరులో కార్తీక మాసం సందర్భంగా ఎంఎల్‌ఎ మంతెన రామరాజు వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. దేవస్థాన ఛైర్మన్ దండు వెంకట కృష్ణంరాజు (డివి) ఎంఎల్‌ఎ మంతెన రామరాజును సత్కరించారు. పద్మావతి సరోవరంలో స్వామి, అమ్మవార్లకు తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. టిటిడి బోర్డు మాజీ మెంబర్ గోకరాజు రామరాజు, గ్రామ పెద్దలు, వివిధ గ్రామాల నుండి పెద్ద ఎత్తున యాత్రికులు విచ్చేశారు. యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండగా ధర్మకర్తల మండలి అధ్యక్షులు దండు వెంకట కృష్ణంరాజు, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి చాగంటి.సురేష్ నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'చంద్రబాబు ఆరోపణలు అవాస్తవం'

ప్రజాశక్తి - పాలకొల్లు

లేనిపోని ఆరోపణలతో చంద్రబాబునాయుడు అల్లర్లు సృష్టించాలని చూస్తున్నారని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ చెప్పారు. ఆదివారం తన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ పోలీసుల ఎంక్వయిరీలో చిట్నేని ఆదిత్య, విజయ్, రాకేష్ మద్యం సేవించి పవన్ కళ్యాణ్ ఇంటి వద్ద కారు ఆపి గొడవ చేస్తుంటే సెక్యూరిటీ అక్కడ గొడవ ఎందుకు చేస్తున్నారని అడిగారని చెప్పారు. ఇది వైసిపికి వారికి చెందిన కారు అని చెప్పి పవన్ కళ్యాణ్ మీద దాడి చేయడానికి రూ.250 కోట్లు సుపారీ ఇచ్చారని చంద్రబాబు, లోకేష్ సోషల్ మీడియాలో ట్రోల్ చేశారని విమర్శించారు. కుట్రలు, కుతంత్రాలు చేయడంలో చంద్రబాబుని మించిన వ్యక్తి లేరని, పవన్ కళ్యాణ్, చంద్రబాబుతో తిరిగితే చాలా ప్రమాదమని చెప్పారు. సమావేశంలో కొరగంజల శ్రీను, జోగి వెంకటేశ్వరరావు, రేలంగి శ్రీను, జోగి వడ్డీకాసులు పాల్గొన్నారు.

కార్తీక వన సమారాధనలో మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - పాలకొల్లు

దేశ సంస్కృతీ సంప్రదాయాలను అనుసరించి అనాదిగా వస్తున్న ఎన్నో పండుగలను పాటిస్తున్నామని, ఇందులో భాగమే కార్తీక వన సమారాధన అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక ఎఎంసిలో పాలకొల్లు నియోజకవర్గ కృష్ణ యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధనలో మంత్రి పాల్గొన్నారు. కార్తీక మాసం వచ్చిందంటే, వన భోజనాలు గుర్తుకు వస్తాయన్నారు. చిన్నా, పెద్దా అందరూ ఆట, పాటలతో సరదాగా కాసేపు కబుర్లు చెప్పుకుంటూ కొంత సమయం గడుపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, ఎంఎల్‌ఎ నిమ్మల.రామానాయుడు, మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనుండాలి

ప్రజాశక్తి - తణుకురూరల్

ప్రజలకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తణుకు సీనియర్ సివిల్ జడ్జి ఎ.నాగశైలజ, ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎవి.నాగరాజు అన్నారు. రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు తణుకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, నల్సా అదనపు జిల్లా జడ్జి విఎస్ఎస్ శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో 8వ వార్డులో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ పౌరులందరికీ సమాన హక్కు కల్పించిందన్నారు. అలాగే మహిళలకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటి ద్వారా వారికి అన్యాయం జరిగితే చట్టాన్ని ఆశ్రయించ వచ్చని తెలిపారు. స్త్రీలకు ఆస్తి హక్కు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోక్సో యాక్ట్, పెళ్లి రిజిస్ట్రేషన్, ఫైర్, దస్తావేజుల గురించి వివరించారు. ఈ సదస్సులో తహశీల్దార్ పిఎస్‌డి ప్రసాద్, ఎంఎల్ఎస్‌సి మెంబర్ కొర్రు వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్యనారాయణ, బార్ అసోసియేషన్ కార్యదర్శి వెన్నవ సుధాకర్, మాజీ వైస్ ప్రెసిడెంట్ టి.సత్యనారాయణరాజు, సీనియర్ న్యాయవాదులు కమన మున్నిస్వామి, ఎ.అజయ్‌కుమార్, భగత్ సింగ్ యూత్ సేవా సంస్థ సభ్యులు, డ్వాక్రా మహిళలు, వార్డు వాలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగశైలజ

ఎపి ఎన్‌జిఒ నరసాపురం అధ్యక్ష కార్యదర్శులుగా

రామ సుబ్బారావు, రమేష్‌రెడ్డి

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఎపి ఎన్‌జిఒ నరసాపురం అధ్యక్ష కార్యదర్శులుగా ఎం.రామ సుబ్బారావు, రమేష్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామారావు తెలిపారు. స్థానిక ఎపి ఎన్‌జిఒ భవనంలో ఆదివారం ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రామారావు మాట్లాడుతూ ఎపి ఎన్‌జిఒ ఏర్పడి సుమారు 50 సంవత్సరాలైందన్నారు. ఆ సమయంలో ఎన్‌జిఒ తరఫున ఉద్యోగులకు అనేక డిమాండ్లు సాధనకు కృషి చేసిందన్నారు. సభ్యులంతా కలిసిమెలిసి తమ న్యాయమైన డిమాండ్లను ఈ సంఘం ద్వారా సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా వ్యవహరించిన హరిబాబు మాట్లాడుతూ వేలి ముద్రలు, బయోమెట్రిక్, ఫేస్ ఐడెంటిఫికేషన్ పేరుతో ప్రభుత్వం అమలు చేస్తున్న విధానం పట్ల ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులంతా సంఘటితంగా పోరాడి తమ డిమాండ్లను సాధించుకుందామని పిలుపునిచ్చారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రామ సుబ్బారావు మాట్లాడుతూ ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. అనంతరం నూతనంగా ఎంపికైన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం తాలూకా వివిధ డిపార్ట్మెంట్ల ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న జిల్లా కార్యదర్శి రామారావు, హరిబాబు

ప్రజాసంకల్ప యాత్రకు ఐదేళ్లు



పేదలకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ, ఎంపిపి కర్రి వెంకటనారాయణరెడ్డి (వాసు రెడ్డి)

ప్రజాశక్తి - పెనుమంట్ర

జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలు నవరత్న పథకాల ద్వారా రాష్ట్ర ప్రజలకు లబ్ధి చేకూరుస్తున్నారని ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ, ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి) అన్నారు. ఆదివారం జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంకల్పయాత్ర చేసి ఐదేళ్లయిన సందర్భంగా పెనుమంట్ర చెరువు వద్ద, సొసైటీ వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి పేదలకు పండ్లు, బ్రెడ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందించడంలో ముఖ్యమంత్రి కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకట శ్రీనివాసరాజు, గ్రామ అధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి, వైస్ ఎంపిపి విసంశెట్టి కిరణ్, గురువు సర్పంచి ముదునూరి నాగరాజు, నత్తా రామేశ్వరం సర్పంచి వెలగల ధర్మారెడ్డి, కలిదిండి దినేష్ రాజు పాల్గొన్నారు.

ఆచంట : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేసి నేటికి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఆచంటలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైసిపి మండల అధ్యక్షురాలు మామిడిశెట్టి కృష్ణవేణి మాట్లాడుతూ సంక్షేమ పథకాల్లో ఎటువంటి అవతవకలకు తావులేకుండా ప్రజలకు నేరుగా అందే విధంగా ముఖ్యమంత్రి పరిపాలించడం అభినంద నీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచి కోట సరోజిని వెంకటేశ్వరరావు, వైసిపి రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్ కుమార్, ఎంపిటిసిలు ఉల్లం జ్యోతి రామానుజం పాల్గొన్నారు.

పెనుగొండ : సిఎం జగన్ ప్రజా సంకల్ప యాత్ర చేసి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా వైసిపి నాయకులు సంబరాలు చేసుకున్నారు. సిఎం జగన్ ఎన్నికల మేనిఫెస్టోలో 98 శాతం హామీలు పూర్తి చేశారని ఎంపిపి పూతినీడి వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతరం ఎస్‌వికెపి కెఎస్.రాజు కళాశాల వద్ద గల వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చిన్నం ఏడుకొండలు మాట్లాడారు. కార్యక్రమంలో జంత్రి శ్రీను, మేడపాడు చిరంజీవి రెడ్డి, పోడూరి రామయ్య, వెలగల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

వీరవాసరం : సిఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్ర ప్రారంభించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం వీరవాసరం బస్టాండ్ సెంటర్ వద్ద వైసిపి నేతలు సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ గూడూరి ఓంకారం మాట్లాడుతూ నాడు రాష్ట్ర వ్యాప్తంగా జగన్‌మోహన్ రెడ్డి ప్రజాసంకల్ప యాత్ర చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకోవడం ద్వారానే నవరత్నాలు రూపకల్పన చేయడం జరిగిందన్నారు. అనంతరం కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రామాధ్యక్షుడు నూకల కనకారావు, వ్యవసాయ సలహా మండల ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, సర్పంచులు పాల్గొన్నారు.

గీత కార్మికుల కోసం నూతన విధానం

రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ శివరామకృష్ణ గౌడ్

ప్రజాశక్తి - ఆకివీడు

రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కార్మికుల ప్రయోజనాల కోసం నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ మాదుం శివరామకృష్ణ గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేసి నేటిగా ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక వైఎస్ఆర్ వద్ద డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ప్రత్యేక అతిథిగా పాల్గొన్న రామకృష్ణ మాట్లాడారు. 2022- 2027 నూతన గీత కార్మికుల పాలసీ ద్వారా ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయని చెప్పారు. కార్మికుల కోసం జిఒ 623 తీసుకొచ్చారని తెలిపారు. గీత కార్మికులకు జరిగిన నష్టాన్ని పూడ్చేందుకు గతంలో ఐదు లక్షల రూపాయలు ఉండే నష్టపరిహారాన్ని ఇప్పుడు రూ.10 లక్షలకు పెంచారన్నారు. చెట్టు మీద నుంచి పడిన వారికి నష్టపరిహారం పెంచగా నైపుణ్యాభివద్ధి సంస్థ ద్వారా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారని తెలిపారు. త్వరలో ఎక్సైజ్ పాలసీలో కూడా మరిన్ని మార్పులు రానున్నాయని, ఆ రకమైన పాలసీ వల్ల కల్లుగీత కార్మికులకు మరింత పని అవసరం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సభ్యులు వేగేసిన వెంకటరాజు (ఎండగండి శీను), నగర పంచాయతీ ఛైర్‌పర్సన్ జామి హైమావతి, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మేకా పార్వతి, కల్లుగీత కార్మిక సొసైటీ ఛైర్మన్ కాగిత రాధాకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ శివరామకృష్ణ గౌడ్, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు

'ఉండి నియోజకవర్గాన్ని జనసేన అడ్డాగా మార్చాలి'

ప్రజాశక్తి - ఉండి

ఇప్పటివరకు టిడిపి కంచుకోటగా ఉన్న ఉండి నియోజకవర్గాన్ని జనసేన అడ్డాగా మార్చేందుకు ప్రతి ఒక్క కార్యకర్తా కృషి చేయాలని జనసేన ఉండి నియోజకవర్గ నాయకులు జుత్తిగ నాగరాజు అన్నారు. వాండ్రం రోడ్డులో ఓ ప్రయివేటు గెస్ట్ హౌస్‌లో ఆదివారం జనసేన నాయకులు శేషపు మణికంఠ ఆధ్వర్యంలో సుమారు వందమంది జనసేన పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఉండి నియోజకవర్గ జనసేన నాయకులు జుత్తిగ నాగరాజు వారిని జనసేన కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలో సుమారు లక్ష మంది ఓటర్లు బిసి, మైనార్టీలకు చెందిన వారని, వారంతా టిడిపి అండగా ఉన్నారు కాబట్టే తెలుగుదేశం కంచుకోటగా ఉండి నియోజకవర్గ ఉందని తెలిపారు. అయితే తెలుగుదేశం, వైసిపి రెండు పార్టీలు అగ్రవర్ణాలకు నియోజకవర్గ పదవీ బాధ్యతలు అప్పగిస్తే జనసేన మాత్రమే బడుగు బలహీన వర్గానికి చెందిన తనకు పార్టీ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిందన్నారు. పవన్ కళ్యాణ్ పై నేటి పాలకులు ఎన్ని కుట్రలు పన్నినా రాష్ట్ర ప్రజల కోసం ప్రాణాలు అర్పించేందుకు తమ నాయకులు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన జగన్మోహన్ రెడ్డి పాలనకు చమర గీతం పాడేందుకు జన సైనికులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రోగ్రాం కమిటీ కార్యదర్శి తోట వాసు, యాదవ సంఘం జిల్లా నాయకులు బలరాం, ఉండి మండల ప్రధాన కార్యదర్శి పడమటి త్రిమూర్తులు, గవర అనిల్, విశ్వేశ్వరరావు, లక్ష్మణ్, కుచ్చు శివకృష్ణ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహక అధికారి డి.రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు పాలకవర్గ సభ్యులు సిబ్బంది యాత్రికులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో భజన కార్యక్రమం చేశారు. పాలకవర్గ సభ్యులు ప్రసాద వితరణ తదితర సేవా కార్యక్రమాలు చేశారు.

వైసిపిలో చేరికలు

పాలకొల్లు: పట్టణంలోని 1, 2 వార్డులకు చెందిన పలువురు టిడిపి నేతలు ఆదివారం వైసిపి కార్యాలయంలో జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైసిపిలో చేరారు. గేదెల శ్రీనివాసరావు, గెద్దా అప్పారావు, గేదెల జానకిరామ్, పెనుమజ్జి రామారావు, పెనుమజ్జి శ్రీను, కొల్లు చిన్ని, గెద్దా హనుమంతుతో పాటు 44 మంది వైసిపిలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కుమార దత్తాత్రేయ వర్మ, మైబెల్ రాజు, అడబాల వెంకటరమణ, ఇజ్జాడ చినబాబు, గేదెల నరసింహారావు పాల్గొన్నారు.

నేడు ఆలయాలు మూసివేత

ప్రజాశక్తి - పాలకొల్లు

చంద్రగ్రహణం సందర్భంగా పాలకొల్లు క్షీర రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని ఈ నెల 8వ తేదీ మంగళవారం ఉదయం 8 గంటలకు మూసివేస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ కోరాడ శ్రీనివాస్, ఇఒ యర్కా సూర్యనారాయణ తెలిపారు. సంప్రోక్షణ అనంతరం 9వ తేదీ బుధవారం తెల్లవారుజామున 5 గంటలకు ఆలయాన్ని తెరుస్తారని చెప్పారు. కార్తీకమాసం 2వ సోమవారం సందర్భంగా యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు.

పాలకొల్లులో టిడ్కో ఇళ్ల పరిశీలన

పాలకొల్లు : పాలకొల్లులో టిడ్కో ఇళ్లను ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు ఆదివారం పరిశీలించారు. లైట్లు వెలగకపోవడం, ఇంటి చుట్టూ పిచ్చి మొక్కలు, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 3, 4 సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉండటం, కోవిడ్ సమయంలో క్వారంటైన్‌కు వాడటం వల్ల అక్కడక్కడ కొన్ని చోట్ల టైల్స్ పగిలిపోవడం తదితర సమస్యల పరిష్కారం కోసం టిడ్కో ఏఈ వద్ద ఫిర్యాదు పుస్తకం పెట్టామని చెప్పారు. ఏ సమస్య ఉన్నా నోట్ చేస్తే పరిష్కారం కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చి త్వరగా పరిష్కరిస్తామన్నారు.